

# ఎందుకే నీకింత తొందరా...

- బలభద్రపాత్రుని రమణి



## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల
## (గత సంచిక తరువాయి)

**ఏదో పోగొట్టుకున్నాం** అని పోయేదాకా తెలీకపోవడమే జీవితం. ఆ పోగొట్టుకున్నదేవిటో అసలు తెలీనే తెలీక పోవడం విషాదం. ఏదో పూడ్చరాని వెలితి జీవితం అంతా నిండిపోతే ఎలా? ఏదో ఓ పక్కగా వుండకుండా.

సియాటిల్ వచ్చాక అత్తయ్య నన్ను చూసి చాలా సంతోషించింది. పరీ నన్ను తనున్న రెండు రోజులూ సిటీ అంతా తిప్పాలనుకుంది. నాకు నిద్రే సరిపోయింది. అత్తయ్యకి మామయ్య వంటలో సాయం చేస్తుండడం చూసి, నేను రెండు రోజుల తర్వాత వంట గది స్వాధీనం చేసుకున్నాను. అత్తయ్యకి పథ్యంగా ఉప్పులూ, కారాలూ, పులుపూ లేకుండా పప్పూ, కూరలూ తీసేసి, మిగతావాళ్ళకి వసుంధర దగ్గర నేను నేర్చుకున్న పాకశాస్త్ర ప్రావీణ్యం చూపించాను.

మావయ్య చాలా మెచ్చుకుంటూ తింటున్నారు. పరీ వెళ్ళే సమయం వచ్చింది.

"ఇండియన్ బజార్, మాల్ తప్ప ఏమీ చూపించలేదు నీకు. మళ్ళీ వచ్చినప్పుడు ఐదు రోజులుంటాను, స్పేస్ నీడిల్, వాటర్ ఫాల్స్ అన్నీ చూపిస్తాను. అమ్మ ఆపరేషన్ డేట్ ఫిక్స్ కాగానే వస్తాను" అని చెప్పి బుగ్గమీద ముద్దు పెట్టి వెళ్తూ ఆగి "ధీరజ్ వచ్చాక నేను చెప్తాలే నిన్ను అప్పుడప్పుడూ ఔటింగ్‌కి తీసుకెళ్ళమని" అని వెళ్ళిపోయింది.

"ధీరజ్ ఎవరూ? అడిగాను.

"మీ అత్తయ్య పెంపుడు కొడుకు" మావయ్య నవ్వుతూ  చెప్పి వెళ్ళిపోయాడు.

"ఆ ధీరజ్ రూం కూడా క్లీన్ చెయ్యండి. వాడు రేపు వస్తానని ఫోన్ చేసాడు" అని అత్తయ్య చెప్పడం విని

"నేను చేస్తా అత్తయ్యా. ఇంతకీ ఎవరూ?" అని అడిగాను.

"మా మాస్టారు గారి మనవడు" అని చెప్పింది.

"ఇక్కడే వుంటాడా?" అడిగాను.

"ఉండేవాడు. ఇప్పుడు కేలిఫోర్నియాలో ఉద్యోగం వచ్చి వెళ్ళిపోయాడు. ఆఫీస్ పనిమీద వస్తూ వుంటాడు" అంది.

నేను మేడమీదున్న మూడు బెడ్‌రూంలలో ఒకటి పరిమళది అని తెలిసి, మధ్యలోది తీసుకున్నాను. అటు చివర రూంలోకి వెళ్ళి మాప్‌తో శుభ్రం చేస్తుంటే, గోడకి గిటార్ వేలాడ్తూ కనిపించింది. కాసేపు ఆసక్తిగా తీగలు మీటాను. ఆ తరువాత టేబుల్ మీదున్న పుస్తకాలు చూసాను. ఇంజనీరింగ్ బుక్స్ అవన్నీ. అల్మారాలో పొందికగా సర్ది పెట్టుకున్న బట్టలూ, హేంగర్స్ కున్న సూట్స్ చూసాను. తలుపులు మూసేసి వస్తుంటే, టేబుల్ మీద పెట్టిన డైరీ కనిపించింది. డైరీ ... అది చాలా ఆకర్షణీయంగా వుంది. అందులో ఒక జీవితం. కొన్ని స్వప్నాలూ వుంటాయని నాకు తెలుసు. ఇతరుల డైరీలు చదవకూడదనీ తెలుసు. ఆ మాత్రం సభ్యత జన్మతహా వచ్చింది. తలుపు లేసి వచ్చేసాను.

అత్తయ్యని హాస్పిటల్‌కి తీసుకెళ్ళేటప్పుడు మావయ్య దార్లోనే వున్న యూనివర్శిటీని చూపించాడు. ఆ కట్టడాలు చూస్తే మనసుకి ఎంతో ఆహ్లాదంగా అనిపించింది. దార్లో స్టార్ బక్స్ దగ్గర ఆగాం. ఎటు చూసినా వెండి కొండలూ, ఆకుపచ్చని చెట్లూ, ఎంతో అందంగా వుంది సియాటిల్.

"వచ్చేనెల నుండీ ఈ పచ్చదనం మాయం అయి మంచు కమ్మేస్తుంది. చెట్లన్నీ మోడులయిపోతాయి" అంది అత్తయ్య.

"మళ్ళీ చిగురించడానికేగా" అన్నాను. జనంలోకి వెళ్ళినప్పుడల్లా, నాకళ్ళు ద్వారక కోసం వెదుకుతున్నాయి. డెస్టినీని నా చేతుల్లోకి తీసుకోవడం నా అభిమతం కాదు. అలా అని నా జీవితాన్ని ఎంత పాళ్ళలో చేదు చేసుకోవాలో తెలీక కాదు.

"అబ్బా!" అన్నాను. కాఫీ చాలా చేదుగా వుంది. ఇంట్లో వేసుకోను కానీ ఈ చేదుకి వెళ్ళి సుగర్ కలుపుకున్నాను.

అత్తయ్యకి సర్జరీ డేట్ ఫిక్స్ అయింది. నేనే వేళకి మందులిస్తూ, ఏం కావాలో చూసుకుంటున్నాను.

"ఈ రోజు సేమ్యా పాయసం చేస్తావా? అమ్మలూ" అంది అత్తయ్య. నన్ను ప్రేమగా అమ్మలూ అంటుంది.

ఆలూ ఫ్రై చేసి, తోటకూర పెసర పప్పులో వేసాను. ఇండియన్ బజార్లో కూరగాయల ధరలు మన డబ్బుల్లో చూసుకుంటే, చచ్చినా కొనలేం. మరీ దారుణం ఒక గోంగూర కట్ట ఎనిమిది, తొమ్మిది వందల రూపాయలు పడ్తుంది. వంట పూర్తి చేసేసరికీ అత్తయ్య పూజ పూర్తయింది. పరీ ఇవాళ వస్తానంది. అందుకే ఎదురు చూస్తున్నా, బయట డోర్ బెల్ మోగగానే, అట్లకాడతో పరిగెత్తా.

"నాకు తెలుసు దెయ్యం నువ్వు వస్తావని" అంటూ డోర్ తెరిచా.

ఎదురుగా వున్న అబ్బాయి, వింతగా చూస్తూ "అమ్మా" అంటూ లోపలికొచ్చాడు.

"ధీరజ్ వచ్చావా? క్రిష్ణయ్యకి ఇప్పుడే సేమ్యా పాయసం నైవేద్యం పెట్టా...రా. కాళ్ళు కడుక్కురా. ఎప్పుడు తిన్నావో ఏమో?" అంటూ లేచి వచ్చింది అత్తయ్య.

మెల్లగా బలహీనంగా వున్నట్లు నడుస్తున్న అత్తయ్యని అతను అతి జాగ్రత్తగా పొదివి పట్టుకుని "రెస్ట్ తీసుకోమన్నాగా ఈ పూజలూ వంటలూ అవీ ఏమిటీ?"అన్నాడు.

"నేను చెయ్యలేదు. రిషి చేసింది. ఇది సమయానికి వచ్చిన నా దేవత" అని నన్ను చూపించింది అత్తయ్య. అతను ధీరజ్ అని నాకు అర్ధమైంది.

"ఎన్ని గంటలకి సర్జరీ?" నన్ను పట్టించుకోకుండా అడిగాడు.

నేను చర్రున మండి వంటగదిలోకి వెళ్ళిపోయాను.

అతను చామనఛాయలో పొడవుగా వున్నాడు. ఎక్సర్‌సైజ్ బాడీలా, ధృఢంగా వున్నాడు. మొహం చాలా సీరియస్‌గా వుంది. పెద్దగా నవ్వడని అర్ధమైంది. ఘొళ్ళున మావయ్య నవ్వులే వినిపిస్తున్నాయి. నేను వంట పూర్తి చేసి అన్నీ టేబుల్ మీద సర్ది పెట్టాను.

మర్నాడు అత్తయ్యకి సర్జరీ. పరి రాలేదు. నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది. వాట్సప్‌కి మెసేజ్ పెట్టాను. చాలాసేపు తను చూడలేదు. మళ్ళీ మళ్ళీ కాల్ చేసాను. ఎత్తలేదు. చాలా సేపయ్యాక "వస్తా.. వీలు చూసుకుని, కొంచెం అర్జెంట్ ఇష్యూస్ వచ్చాయి" అని మెసేజ్ పెట్టింది.

మావయ్యా, ధీరజ్ హాస్పిటల్‌లోనే వున్నారు. నేను ఇంటి దగ్గర వంట చేసి కేరియర్‌లో సర్దేసి, ఇద్దరిలో ఎవరొచ్చినా హస్పిటల్‌కి వెళ్దామని కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నాను. అప్పటికే నాన్న రెండుసార్లూ, బామ్మ ఓసారీ "ఆపరేషన్ అయిందా? కులాసాగా వుందా సీత?" అని ఫోన్స్ చేస్తున్నారు.

డోర్‌బెల్ మోగితే ఆత్రంగా పరిగెత్తుకెళ్ళి డోర్ తీసా. ధీరజ్ వచ్చాడు. ఎప్పటిలాగే సీరియస్ ఫేస్‌తో 'హాయ్' అన్నాడు.

"సర్జరీ అయిందా ఎలా వుంది? నేను రానా?" అడిగాను.

అతను మేడమీదకి వెళ్తూ "ఓవర్ .. ఎవ్రిథింగ్ ఈజ్ ఆల్‌రైట్" అని తన గది తలుపులు బిడాయించుకున్నాడు.

నేను ఉస్సూరంటూ కూలబడ్డాను.

మాట్లాడే వాళ్ళుంటే నేను ఎగతాళి చేస్తూ వాళ్ళతో కాలక్షేపం చేస్తాను కానీ 'షట్ ది డోర్ ' టైప్ వాళ్ళతో డీల్ చెయ్యలేను. అతను అత్తయ్యతో మాత్రం ప్రసన్నంగా మాట్లాడ్తాడు. అంతే.

మావయ్యకి ఫోన్ చేసాను. మావయ్య తీసి "నేను వచ్చాకా నిన్ను హాస్పిటల్‌కి తీసుకొస్తాను. అత్తయ్యకి ఆపాటికి స్పృహ వస్తుంది" అని పెట్టేసారు. శేఖరం మావయ్య ఎప్పటిలా "హాయ్ డార్లింగ్ అని జోక్‌గా మాట్లాడలేదు. హాస్పిటల్ కదా అని సరిపెట్టుకున్నాను. పరిమళమీద కోపం వచ్చింది. ఇలాంటప్పుడు తల్లి కన్నా అర్జెంట్ ఏవిటి దాని మొహం? వసుంధర గుర్తు వచ్చింది. ఏడిపించినా ఏమీ అనదు. నేను అన్నం తినకపోతే గిలగిలలాడిపోతుంది. అలాంటి తల్లికి సర్జరీ. ఓ పార్ట్ తీసేస్తున్నారంటే కూడా రాలేదు. ముక్తసరిగా మాట్లాడ్తోంది. బహుశా విదేశాల్లో సంస్కృతి అంతేనేమో?

ఎమోషనల్ కారేమో అనుకున్నాను. రెండు అయింది. మూడు అయింది. గది తలుపులు తెరుచుకుని ధీరజ్ ఇవతలకి రాలేదు. నాకు కడుపులో అదోలా అవుతుంటే ఆకలని తెలిసింది. అప్పుడు మావయ్య వచ్చారు, "నువ్వు అన్నం తిన్నావా?" అడిగారు.

"లేదు" అన్నాను.

"త్వరగా తిను హాస్పిటల్‌కి వెళ్దాం, తన బిపి కంట్రోల్ అవక కాంప్లికేషన్ వచ్చింది. రాత్రికి నువ్వు అత్తయ్య దగ్గరే వుండాల్సి వస్తుంది అన్నారు.

"అందుకేగా వచ్చాను" అని త్వరత్వరగా అన్నం తినేసి, మేడ మీదకి వెళ్ళి తయ్యారవుతుంటే ధీరజ్ ఎవరితోనో గట్టిగా పోట్లాడుతున్నట్లు మాట్లాడడం వినిపించింది. నా కెందుకులే అని డ్రెస్ చేంజ్ చేసుకుంటుంటే "పరీ.. యూ ఆర్ టాకింగ్ సెన్స్‌లెస్‌లీ  యూ విల్ పే ఫర్ దట్.. యూ విల్ రిపెంట్" అనడం క్లియర్‌గా వినిపించింది. షాక్ అయ్యాను. అంతలా పోట్లాడుకోవలసింది ఏవొచ్చిందబ్బా వీళ్ళిద్దరికీ అని. బహుశా రాలేదనే ఏమో? అత్తయ్య అంటే ఇతనికి చాలా ఇష్టంగా అని సరిపెట్టుకున్నాను.

బయటకి వచ్చేసరికి నా బ్యాగ్‌తో, అక్కడ ధీరజ్, మావయ్యా మాట్లాడుకుంటున్నారు.

"ఇట్స్ ఆల్ రైట్. వదిలెయ్యండి. నేను సెటిల్ చేసుకుంటాను" అన్నాడు ధీరజ్.

"గారాబం చేసి నెత్తి నెక్కించుకున్నాం మేమే" అని మామయ్య దీర్ఘంగా నిట్టూర్చారు.

పరి రాకపోవడం విషయమేలే అనుకుని, "మామయ్యా నేను రెడీ" అన్నాను.

"నైట్ డ్రెస్ తీసుకున్నావా? ఓకె పద" అన్నారు మామయ్య.

"మీరు రెస్ట్ తీసుకోండి. నేను తీసుకెళ్తాను" ధీరజ్ చెప్పాడు. మామయ్య సరేనన్నట్లు కొంచెం అలసటగా వున్నారేమో సోఫాలో చేరగిలబడ్డారు.

విదేశాల్లో జీవితం బహుశా మిడ్ ఏజ్‌దాకా బావుంటుంది. ఓల్డ్ అవుతున్న కొద్దీ 'నా అన్నవాళ్ళు' లేక ఇబ్బందే అనిపించి, ఏవిటి నేనిలా అమ్మా, పెద్దమ్మలా మాట్లాడుతున్నానూ అనుకున్నాను.

ధీరజ్ పక్కన సీట్ బెల్ట్ పెట్టుకుని, "మీరు లంచ్ చేసారా?" అడిగాను.

అతను ఔనూ కాదూ అనలేదు. "ట్రాఫిక్ వుంది. ఇట్ టేక్స్ ఫార్టీ మినిట్స్" అన్నాడు ఎటో చూస్తూ. ఆ తర్వాత మ్యూజిక్ ఆన్ చేసాడు.

"పరీ రేపైనా వస్తుందా?" నేను ఓ ఇనప సుత్తిలాంటిది తీసుకుని, అతని చుట్టూ వున్న గోడ పగలకొట్టడానికి ప్రయత్నం మొదలు పెట్టాను.

"డో నో" నిర్లక్ష్యంగా అన్నాడు.

చూయింగ్ గం తీసుకుని ఒకటి తన నోట్లో వేసుకుని, ఇంకోటి నా ముందుకి, చేత్తో పట్టుకుని ఆఫర్ చేసాడు. ఇవన్నీ మాటలు లేకుండానే.

"మీరు అత్తయ్యా వాళ్ళకి బంధువులా?" అడిగాను.

"సార్ట్ ఆఫ్.."

చాలా పొదుపు పాటిస్తున్నాడు. మా పాలవాడు కొసరు వేసినట్లు. "రేయ్ మాట్లాడరా..నీ.." అని కాలర్ పట్టి లాగితే అన్న ఊహ వచ్చినా ఆపుకున్నాను.

"మీరు ఎక్కువగా మాట్లాడరా?" మళ్ళీ నా ప్రయత్నం సాగించాను.

అతను నా వైపు చూడకుండానే "ఊ" అన్నాడు.

"వై?"

ఈసారి చిరాగ్గా "ఏవుంది మాట్లాడ్డానికి?" అన్నాడు.

"నా గురించి అడగచ్చు. మీ గురించి చెప్పచ్చూ.. ఏదైనా" అన్నాను.

"ఒకళ్ళ గురించి ఒకళ్ళు అన్నీ అబద్దాలే చెప్పుకుంటారు. ముఖ్యంగా ఆడా మగా.. అస్సలు తెలీదు ఒకళ్ళకి ఒకళ్ళు వాళ్ళేవిటో. గాలి కబుర్లు బోలెడు చెప్పుకుంటారు. హే ... యూ లైక్ జెన్నీఫర్ లోపేజ్.. మీ టూ.. యూ లైక్డ్ మై రెడ్ డ్రెస్?.. ఐ లవ్ యువర్ డ్రెస్ సెన్స్.. ఇలా" అని హేళనగా నవ్వాడు.

నాకు కొంచెం భయం వేసింది. ఫస్ట్ టైమే ఇంత రూడ్‌గా మాట్లాడాడు. ఇంకో మాట మాట్లాడితే డోర్ తెరిచి కిందకి దిగిపోమంటే.. అని

"ఓకె...ఓకె.. కూల్" అన్నాను.

ద్వారక గుర్తొచ్చాడు. ఈ పాటికి ఎన్నిసార్లు పొగిడేవాడో. లాస్ట్‌మినిట్‌లో ముద్దుకూడా పెట్టుకున్నాడు. జీవితంలో ఈ నిమిషం నాది. పూర్తిగా ఎంజాయ్ చెయ్యాలి అన్నట్లుంటాడు. తను నవ్వుతూ పక్క వాళ్ళని నవ్వించే ప్రయత్నం చేస్తాడు. ఇతనేవిటి ఇంత విషాదంగా.

ఇందాక పరీతో పోట్లాడాడు. ఆ ఎఫెక్టేమో బహుశా పరీతో లవ్ ట్రాక్ వుండి వుంటుంది. తను వస్తుందనే లీవ్ పెట్టి ఇతనొచ్చాడు. తీరా పరి రాలేదు. నాకు చెప్పినట్లే ఏదో సాకులు చెపితే ఇరిటేట్ అయ్యాడు. ఎవరైనా గొడవ పడి మూడ్ పాడు చేసుకుంటే, అది తప్పకుండా లవర్స్‌తోనే అవుతుంది.

ప్రేమించిన వాడు వస్తానని రాకపోతే, లోకం అంతా శూన్యంగా, అందరూ మనని దగా చేసినట్లూ అనిపిస్తుంది. అస్సలు క్షమించలేము.

నేను నిశ్శబ్దంగా కుర్చున్నాను. అతను జుట్టులో వేళ్ళు జొనిపి చెరుపుకుంటూ..ష్...ష్.. అన్నాడు.

తర్వాత "సారీ మీతో రూడ్‌గా బిహేవ్ చేసా" అన్నాడు.

"ఇట్స్ ఆల్ రైట్" అన్నాను.

నా అహం కొంచెం చల్లారింది.

"పరి ఎందుకు రావడంలేదో చెప్పిందా? అడిగాడు.

"హూ!" అని ఆలోచించినట్లు చేసి "పెళ్ళి అనుకుంట. మే బీ సం వైట్‌తో.. పాల్ ఆర్ జాన్" అన్నాను.

అతను సీరియస్‌గా చూసాడు.

"మీ ఇంట్లో అందరికీ ఇలా సమయం సందర్భం లేకుండా జోక్స్ వెయ్యడం అలవాటా?" అన్నాడు.

"జోక్ అనే అనుకుంటున్నారా?" అడిగాను.

"షీ ఈజ్ మై ఫియాన్సీ" సీరియస్‌గా చెప్పాడు.

ఈసారి షాక్ తినడం నా వంతు అయింది.

"ఈజ్ ఇట్? కంగ్రాట్స్. షీ ఈజ్ ఎ డార్లింగ్. నేను అబ్బాయి అయితే మీదాకా దాన్ని రానిచ్చేదాన్ని కాదు" అన్నాను.

ఈసారి ఇంకా సీరియస్‌గా చూసి "ఓ! ఏవుందో తనలో అంత?" అన్నాడు.

"షీ ఈజ్ స్మార్ట్. బ్యూటిఫుల్" అన్నాను.

"అదే.. అదే అనుకుని బోర్లా పడ్డాను" అన్నాడు.

"పెళ్ళి ఎప్పుడూ?" అడిగాను.

"అది మాట్లాడ్తాననే ఎవాయిడ్ చేస్తోంది. బహుశా నేను రాకపోతే తనే వచ్చి వాళ్ళమ్మని చూసుకునేదేమో? అనవసరంగా వచ్చాను" అన్నాడు.

అతని గోడ విరగ్గొట్టానని సంతోషంగా ఫీల్ అయ్యాను.

"ఏదో అర్జెంట్ పని వచ్చినట్లుంది పాపం" అన్నాను.

"సర్జరీ డేట్ అనెక్స్‌పెక్టెడ్ కాదుగా" అన్నాడు.

"మనం లవ్ చేసిన వాళ్ళతోనే తక్కువ అండర్‌స్టాండింగ్‌లో వుంటాం. అదే జస్ట్ ఫ్రెండ్ అయితే వాళ్ళని సమర్థిస్తాం. ఏదో ఆఫీస్‌లో అర్జెంట్ అయివుంటుందిలే పాపం" అని అన్నాను.

"దిస్ ఈజ్ నాట్ ఫస్ట్ టైం" అన్నాడు.

కొంచెం సంకోచంగా "ఇది అరేంజ్‌డా? లవ్వా?" అన్నాను.

"నేను వాళ్ళ ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా వుండేవాడిని. వేరే స్టేట్‌కి షిఫ్ట్ అవుతున్నాను అని చెప్పినప్పుడు తను నన్ను డేట్‌కి తీసుకెళ్ళి ప్రపోజ్ చేసింది. అప్పటిదాకా నాకా ఫీలింగ్స్ లేవు. పరి మాత్రం నేను వెళ్ళడం తనకి ఇష్టం లేదనీ ఆ నిమిషం మేరేజ్ చేసేసుకుందాం అనీ తనూ నాతో వచ్చేస్తాననీ అంది" అని ఆగి నేను ఒప్పుకుని చేసేసుకుని వుంటే

బావుండేది కానీ నేను ఫస్ట్ ఎడ్యుకేషన్ అని చెప్పి, తనని రీసెర్చ్ కంప్లీట్ చెయ్యడానికి పంపించాను. మా ఇద్దరి పేరెంట్స్‌కీ అభ్యంతరాలు లేవు. ఆనందమే తప్ప. నేను శాన్‌ఫ్రాన్సిస్‌కో మూవ్ అయిపోయాక, మా లాంగ్ డిస్టెన్స్ లవ్‌లో ఇబ్బందులు మొదలయ్యాయి. ఇదిగో ఏడాదిగా అస్సలు కలవడానికే కుదరడం లేదు" అన్నాడు.

ఆలోచనగా నేను "మీ మీద ప్రేమ ఏమైనా తగ్గిందా పరికి? అలా అనిపిస్తోందా?" అన్నాను.

"నో.. ఇప్పటికీ నేనంటే చాలా ప్రేమ తనకి" అన్నాడు.

"ఐ థిక్ ఐ కెన్ టాక్ టు హర్" అన్నాను.

"అమ్మ చాలాసార్లు మాట్లాడారు. పరికి ఆవిడతోకూడా గొడవలయి "ఇది నా పర్సనల్ దీని విషయమై మాట్లాడొద్దు అంది" అన్నాడు.

"తనకి ఇంకెవరైనా కలిసారని అనుకుంటున్నారా మీరు?" అడిగాను.

"ఇంపాజిబుల్" అన్నాడు.

హాస్పిటల్ వచ్చింది. ధీరజ్ కారు ఆపి, నేను దిగుతుండగా చెప్పాడు "యు షుడ్ హెల్ప్‌మీ.. ప్లీజ్"

"ఏం చెయ్యాలి?"

"పరి ఇలా నన్ను ఎందుకు తప్పించుకుంటోందో తెలుసుకోవాలి" అన్నాడు.

నేను సీట్ బెల్ట్ తియ్యడం మానేసి, అతనివైపు ఆశ్చర్యంగా చూస్తూ "డిటెక్టివ్ పని చెయ్యాలా?" అన్నాను.

అతను తల అడ్డంగా ఊపాడు.

"ఇలా అన్నానని ఏం అనుకోవద్దు. మీ మీద ఇంట్రెస్ట్ పోయిందేమో?" అన్నాను.

"నో...నో.. పరి చెప్పింది" అని ఆగాడు.

"ఏం చెప్పింది?"

"నాతో తప్ప ఇంకెవరితో తను బెడ్‌లో ఫిజికల్‌గా ఎరౌజ్ అవలేనని. ఓన్లీ మీ అని" అన్నాడు.

ఆ మాటకి చాలా సిగ్గేసింది. ఇంత పచ్చిగా చెప్తాడేంటీ? అవతల పెళ్ళికాని పిల్ల అన్నజ్ఞానం వుండద్దూ? అనిపించింది.

"అంతదాకా వచ్చారా అయితే" అన్నాను.

"వైనాట్? వి ఆర్ డేటింగ్. పెళ్ళి కూడా చేసుకుంటాం" అన్నాడు.

వీడి గోడ నేను పగలకొట్టేలోపే వీడి సుత్తి నా నెత్తి పగలగొట్టింది అనుకుని, "ఓకే" అని దిగాను.

అతను కారు పార్క్ చేసి వచ్చి "పరీతో మీరే మాట్లాడగలరు. ప్లీజ్" అన్నాడు.

తల ఊపాను.

నేను ఎంత అప్‌డేటెడ్ అనుకున్నా, ఇంకా భారత స్త్రీనే. తల్లితండ్రుల చాటు బిడ్డనే. ఇంత ముందుకు ఎవడితోటీ ఇప్పటిదాకా వెళ్ళలేదు. బహుశా అమెరికాలో వుంటే, టాగ్ వేసేవారేమో? ఇది ఎందుకూ పనికిరాదు. ఒక్క బోయ్ ఫ్రెండ్ కూడా లేదని.

అత్తయ్య ఇంకా కళ్ళు మూసుకునే వుంది. డాక్టర్‌తో ధీరజ్ మాట్లాడితే, ఇందాక స్పృహలోకొచ్చి జ్యూస్ తాగిందని చెప్పారు. బామ్మ వుంటే, ఆపరేషన్ అయిన పిల్లకి జ్యూస్ ఏంట్రా అక్కుపక్షీ? నెమ్ము చెయ్యదూ? అని క్లాస్ పీకేది.

అత్తయ్య మీద చెయ్యి వేసాను.

"పరీ" అంది కళ్ళు తెరవకుండానే, ఈవిడకీ దాని కలవరింతే దానికి మాత్రం ఇటు 'తల్లీ, అటు ప్రేమించినవాడూ కూడా పట్టకుండా ఏమిటో ఉద్యోగం అంటుంది. ధీరజ్‌లాంటి ఫియాన్సీ వుంటే నేను కలెక్టర్ ఉద్యోగం అయినా మానేసేదాన్ని అనుకున్నాను.

"అమ్మా రుష్యేంద్రమణీ నీకంత సీన్ లేదు. ఏం కలెక్టర్ అవుదాం అనుకున్నావ్? బిల్ కలెక్టరా?" అని మనసు హేళన చేసింది. దిక్కుమాలిన మనసుని నేను పెద్దగా పట్టించుకోను అది వుండడమే అసలు నాకిష్టం లేదు.

అత్తయ్య నీరసంగా కళ్ళు తెరిచి, నన్ను గుర్తుపట్టి "పరీ" అంది.

"వస్తుంది అత్తయ్యా ఫోన్ చేసింది, ఎలా వుంది ఇప్పుడూ?" అడిగాను.

హూ! "నిట్టూర్చి వున్నానులే" అంది.

అత్తయ్యకి నర్స్ వచ్చి ఏవో రీడింగ్స్ తీసుకుని, సెలైన్ అమర్చి వెళ్ళింది.

ధీరజ్ వచ్చి కుశల ప్రశ్నలు అడిగాక, "మీరు ఇంటికెళ్ళి భోంచెయ్యండి. నేను ఉంటాను" అన్నాను.

"ఇంకా నువ్వు తినలేదా ధీరా. వెళ్ళు" అంది అత్తయ్య ప్రేమగా.

అతను నావైపు చూసి "ఈ మణిలాంటి ఇండియా అమ్మాయిని నేను సెలెక్ట్ చేసుకుంటే బావుండేది ఆంటీ, మా అమ్మలా నీలా నాకు టైముకి కాఫీ, టిఫిన్, భోజనం పెట్టేది" అన్నాడు.

నాకు చర్రుమని మండింది. ఇంతసేపూ నకు తన లవ్ స్టోరీలో చెప్పరానివి కూడా చెప్పుకుని, ఇప్పుడు నాలాంటిది అయితే ఈయన్ని బేబీ సిట్టింగ్ చేసేది అంటాడా?

"ఓయ్! నేనేం అంత హోమ్లీ టైప్ కాదు మీకు వండి వార్చడానికి. ఏదో మా అత్తయ్య మీద ప్రేమతో యూ.ఎస్. వచ్చాను. మరీ పాత చింతకాయ పచ్చడి టైప్ అనుకోవచ్చు" అన్నాను.

"మీ పూర్తిపేరు విని బ్లాక్ అండ్ వైట్ ఎరాలోకి వెళ్ళాను. మీ పేరు రుష్యేంద్రమణి అట కదా! పరీ చెప్పింది" అని పెద్దగా నవ్వాడు.

అక్కడున్న సెలైన్ స్టాండ్ పీకి అతన్ని రెండు పీకాలనిపించినా ఊరుకున్నాను.

"నా పేరు మా బామ్మ పెట్టింది. అప్పుడు నేను ఉయ్యాలలో ఉన్నాను. గట్టిగా ఆవిడ్ని కోరుకుందాం అంటే అప్పటికి పళ్ళుకూడా రాలేదు పాపం" అన్నాను.

అత్తయ్య బలహీనంగా అయినా నవ్వింది.

"కాఫీ తాగుతారా రుష్యేంద్రమణీ?" అని నన్ను అడిగాడు.

"నో థాంక్స్" అన్నాను.

"కారిడార్ చివర కాఫీ షాప్ వుంది" చెప్పాడు.

"థాంక్స్" అన్నాను.

సముద్రంలో ఉప్పునీ చెట్టుమీద కాయినీ కలిపినట్లు కొన్ని జోడీలని కలుపుతుంటాడు ఆ దేవుడు. బహుశా స్క్రీన్‌ప్లే క్లాస్‌లు బాగా తీసుకున్నాడనుకుంట. ఇంత విశాలమైన సియాటిల్ సిటీలో ఈ శాల్తీ ఇలా ఇక్కడ హాస్పిటల్‌లో, కారిడార్‌లో నన్ను గుద్దుకుని, కాఫీ నా ఒంటిమీద పడిపోయేటంత పనిచేసి, నాకళ్ళలోకి చూసి, గుర్తుపట్టి ఆనందంగా "మునీశ్వరమణీ" అని అరుస్తాడని అస్సలు కలగనలేదు.

నేనూ ఆశ్చర్యంగా ద్వారకని చూసి, అతను పిలిచిన పిలుపుకి కాలి "హస్తినాపురీ.. హాయ్" అన్నాను.

అతను సీరియస్‌గా "అలాంటి పేరు కల బోయ్‌ఫ్రెండ్ కూడా మీకు వున్నాడా? బట్ ఐ యాం ద్వారకానందన్" అన్నాడు.

"నా పేరు కూడా మునీశ్వర మణికాదు" అన్నాను.

"అదే మీనింగ్ వస్తుందే" అని నెత్తిమీద కొట్టుకుని ఓ రుష్యేంద్రమణి కదూ. మీ పేరు మా ఫ్రెండ్స్‌కి చెపితే, మిమ్మల్ని వేరేగా ఊహించుకున్నారు" అన్నాడు.

"ఎలా?" కోపంగా అడిగాను.

"ముందు ఈ సీవ్యూ హాస్పిటల్స్‌లో మీరేం పనిమీద వచ్చారో చెప్పండి" అన్నాడు.

"మా అత్తయ్యకి సర్జరీ అయింది. అందుకే నేను సియాటిల్ వచ్చాను" అన్నాను.

"ఓ అయితే మీరు బోథెల్‌లోనే వుంటారా?" ఆనందంగా అడిగాడు.

"అవును అనుకుంట" అని తల తిప్పితే ధీరజ్ వస్తూ కనిపించాడు. టర్టిల్ నెక్ స్వెట్టర్‌లో పొడవాటి ధీరజ్ ప్యాంట్ జేబులో రెండు చేతులూ పెట్టుకుని వస్తుంటే, భలే హేండ్‌సమ్ గా అనిపించాడు.

"మా బోయ్ ఫ్రెండ్ వస్తున్నాడు.. అదిగో" అన్నాను.

ద్వారక అటు చూసాడు.

ధీరజ్ దగ్గరకి వస్తుంటే, ఎదురెళ్ళి షేక్‌హేండ్ ఇచ్చి "కంగ్రాట్స్ ఇంత అందమైన గర్ల్‌ఫ్రెండ్ వున్నందుకు" అన్నాడు.

నేను షాక్‌గా చూసాను.

ధీరజ్ అతని చెయ్యి పట్టుకుని "ఏంట్రా? నువ్విక్కడ" అన్నాడు.

"అమ్మకి రెగ్యులర్ చెకప్. ఎనీ హౌ యూ ఆర్ లక్కీ. నీకో మణి దొరికింది" అని నన్ను వెక్కిరింతగా చూసాడు.

"మీ ఇద్దరికీ పరిచయం వుందా?" ఆశ్చర్యంగా అడిగాను.

"కలసి చదివి ఏడ్చాం" అని ద్వారక నవ్వాడు.

ధీరజ్ సీరియస్‌గా "అమ్మని చూడాలి ఏ రూం?" అడిగాడు.

"అబ్జర్వేషన్ రూం. ఇంతకీ నువ్వెందుకు వచ్చావురా?" ద్వారక అడిగాడు.

"ఆంటీ తెలుసుగా పరీ వాళ్ళమ్మ. వాళ్ళింట్లోనే వుండేవాడిని కదా. ఆ ఆంటీకి సర్జరీ చేసి గాల్‌బ్లాడర్ తీసేసారు. సో ఈవిడ, ఆంటీ నీస్. ఇండియానుండి వచ్చారు.. పేరు..."

"ఆయనకి బాగా తెలుసులెండి" నేను అడ్డుపడ్డాను. ద్వారక పెద్దగా నవ్వి" ఆ పేరు వల్లే మిమ్మల్ని ఎవరూ త్వరగా మర్చిపోలేరు" అన్నాడు.

అంతకంటే నాలో ఏ ప్రత్యేకతా లేదనే విషయం నొక్కి వక్కాణిస్తున్నట్లుగా.

COMMENTS